'ఎన్నికలకు దూరం చేసేందుకు కేంద్రం కుట్ర'

కాచిగూడ: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఎన్నికలకు దూరం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి సోమనబోయిన ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్) జరుపుతున్న ఎన్నికల కమిషన్ (ఈసీ) ఓటర్ నమోదు కార్యక్రమం ప్రజాస్వామిక వాదులను తీవ్ర విస్మయానికి గురిచేస్తోందని అన్నారు. ఓటరు నమోదుకు కావాల్సిన ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, వృద్ధాప్య పెన్షన్‌ను పరిగణలోకి తీసుకోకపోవడంతో కోట్లాది మంది పౌరులు ఓటర్లుగా నమోదు కాకుండా ప్రేక్షకులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ అవసరాలకు ఆధార్‌కార్డును పరిగణలోకి తీసుకుంటున్నప్పుడు ఓటరు నమోదులో ఈసీ ఎందుకు ఆధార్‌కార్డును విస్మరిస్తోందని ఆయన ప్రశ్నించారు.

కార్మిక చట్టాలను మార్చడం దుర్మార్గమైన చర్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోరాడి సాధించుకున్న చట్టాలకు తూట్లు పొడుస్తు కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ అన్నారు. నేడు జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను మార్చడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కనీస వేతనాల బోర్డు మాజీ చైర్మన్ పి. నారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జీఓ.282 తీసుకొచ్చి కార్మికులకు పని గంటలను పెంచడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మ్యారేజ్ బ్యూరోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో మ్యారేజ్ బ్యూరోలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి వారికి భద్రత కల్పించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సావనీర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. మ్యారేజ్ బ్యూరోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని సభ్యులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను సంస్థ పక్షాన ఘనంగా సన్మానించారు.

'బడిబాట'కు విశేష స్పందన

డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్: ఈ విద్యా సంవత్సరం ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని 1, 2 శాఖలలో బడిబాటకు విశేష స్పందన లభించిందని ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలం-1 పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో గతేడాది 977 మంది విద్యార్థులు ప్రవేశం పొందారన్నారు. అయితే ఈ ఏడాది 1045 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని తెలిపారు. మండలం-2 పరిధిలోనూ ఎక్కువ మంది ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు.

ఉజ్జయిని మహంకాళి ఆలయ కమిటీ సభ్యుడిగా శ్రీకాంత్‌గౌడ్

అంబర్‌పేట: సికింద్రాబాద్ ఉజ్జయిన మహంకాళి ఆలయ కమిటీ సభ్యుడిగా అంబర్‌పేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంభుల శ్రీకాంత్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ఆయన నియామకాన్ని ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మవారి ఆశీస్సుల వల్లే తనకు ఈ అవకాశం దక్కిందని శ్రీకాంత్‌గౌడ్ అన్నారు.

సార్వత్రిక సమ్మెకు మేం దూరం

చిక్కడపల్లి: కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొనడం లేదని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) సంఘటన రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని బీఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ సమ్మెకు తాము దూరంగా ఉంటున్నామని అన్నారు. తమ అనుబంధ సంఘాలేవి ఈ సమ్మెలో పాల్గొనడంలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన కోడ్ ఆన్ వేజెస్-19, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీస్‌ను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు.

సొసైటీకి సమాచారం లేకుండా ఆలయ స్థలంలో నిర్మాణాలు

కవాడిగూడ: కవాడిగూడ ఎస్‌బీఐ కాలనీ శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయంలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులను కాలనీ సొసైటీ సభ్యులతో భర్తీ చేయాలని ఎస్‌బీఐ స్టాఫ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. గుడిని స్వాధీనం చేసుకునేందుకు గాంధీనగర్ ఆర్యవైశ్య సంఘం, బయటి వ్యక్తులు యత్నిస్తున్నారని అన్నారు. సొసైటీకి సమాచారం లేకుండా వారు ఆలయ స్థలంలో పలు నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. దీనిపై ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌బీఐ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రశేఖర్, సలహాదారులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సరళ, శంకర్‌గౌడ్, కోశాధికారి కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాతో జాగ్రత్త.!

- విరేచనాలు.. లవణ నష్టంతో నీరసం
- నీటి, ఆహార కలుషితాలే కారణం
- వానాకాలంలో సులభంగా వ్యాప్తి
- చిన్నారులపై తీవ్ర ప్రభావం

పేగులను పిండేసే ఈ వ్యాధి ప్రమాదకరం



వ్యాధి లక్షణాలు...

- తరుచూ వాంతులు,విరేచనాలు కావడం.
- నాలుక పిడచ కట్టుకుపోవడం, కళ్లు లోపలికి పోవడం.
- చర్మం సాగే గుణం కోల్పోవడం. రక్తపోటు పడిపోయి అపస్మారక స్థితిలోకి పోవడం.

నల్లకుంట: వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులు ఒక్కసారిగా చుట్టుముడుతాయి. ఈ కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే దీని ప్రభావం చిన్నారులపై తీవ్రంగా ఉంటుంది. వర్షాకాలం వచ్చే వ్యాధుల్లో డయేరియా(అతిసార) ముఖ్యమైనది. దీనికి నీటి కాలుష్యం, ఆహార కాలుష్యం ముఖ్య కారణాలు కాగా, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన వ్యాధి వ్యాప్తికి దోహదపడుతుంది. పెద్దలైనా, పిల్లలైనా ఓ సారి డయేరియా బారిన పడితే శరీరంలో ఉన్న లవణాలన్నీ బయటకు వెళ్లిపోయి శరీరం శుష్కించిపోతుంది. చిన్నారుల్లో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు దెబ్బతిని అపస్మారక స్థితికి చేరుకునే పరిస్థితి వస్తుంది. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన వద్దని అధికారులు పదేపదే చెబుతున్నా మురికి వాడల్లోని ప్రజానీకంలో తగిన చైతన్యం రాకపోవడంతో ఓ రోగి నుంచి మరొకరికి ఈగల ద్వారా రోటా వైరస్ క్రిమి వ్యాపిస్తుంది. వాటి ద్వారా ఆహార పదార్థాలు కలుషితమై డయేరియాకు దారి తీస్తాయి. ప్రధానంగా ఐదేళ్ల లోపు చిన్నారులు డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ఫీవర్‌కు పెరుగుతున్న డయేరియా కేసులు..

నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 15వ తేదీ వరకు 1,034 కేసులు నమోదయ్యాయి.

నీటి కాలుష్యం ద్వారానే అధికం..

వర్షాలు కురుస్తుండంతో చిన్నపిల్లలు, వృద్ధులు వ్యాధుల బారిపడుతున్నారు. డయేరియా వ్యాధి ఎక్కువగా నీటి కలుషితం ద్వారానే వస్తుంది. ఈ వర్షాకాలంలో మంచినీటి వనరులు, రిజర్వాయర్లలో కలుషిత నీరు చేరి, కుళాయిల ద్వారా అవే రావడం వల్ల డయేరియా వచ్చే అవకాశాలు ఎక్కువ. మంచినీటి పైపులు లీక్ అయినప్పుడు అందులో మురికినీరు కలిసి ఆ నీటిని తాగడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. 80 శాతం డయేరియాకు కలుషిత నీరే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక మిగిలిన 20 శాతం కలుషిత ఆహారం వల్ల వస్తుంది. నగరంలో చాలా వరకు ఈ వర్షాకాలంలోనే డయేరియాకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

నిర్లక్ష్యం వద్దు...



వర్షాకాలంలో డయేరియా వ్యాధిపట్ల ఎలాంటి నిర్లక్ష్యం వద్దు. చిన్నారుల్లో ఈ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. లేదంటే తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. ఆహార నియమాలు, చిన్నపాటి జాగ్రత్తలతో వ్యాధిని నియంత్రించుకోవచ్చు. ఏడు సంవత్సరాలు పైబడిన వారికి ఫీవర్‌లో చికిత్సలు అందిస్తున్నాం. ఏడు సంవత్సరాల లోపు చిన్నారులను నీలోఫర్‌కు పంపిస్తాం. – డాక్టర్ జయలక్ష్మి, ఫీవర్ ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో

'లక్కీ' కనిపిస్తే చెప్పండి.!

- వీధిలో తచ్చాడుతున్న పెంపుడు కుక్కను తీసుకెళ్లిన ఓ మహిళ
- కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరుతున్న యజమాని



అంబర్‌పేట: అప్పటి వరకు ఆ కుక్క పిల్ల 'లక్కీ' ఇంట్లో సందడి చేసింది. యాజమాని ఉద్యోగానికి వెళ్లేందుకు తయారవుతుండగా అతడి వెంటే తిరిగింది. అతడిని గేటు వరకు సాగనంపి ఇంట్లోకి వెళ్లకుండా వీధిలో కాసేపు నిల్చుంది. వీధిలో అటు ఇటుగా తచ్చాడుతున్న ఆ కుక్క పిల్లను ఓ మహిళ తన వెంట తీసుకెళ్లింది. ఈ సంఘటన మంగళవారం కాచిగూడ పోలీసుస్టేషన్ పరిధిలోని నింబోలిఅడ్డా మోతీమార్కెట్ చోటు చేసుకుంది.

◆ మోతీమార్కెట్‌లో నివసించే మహేందర్ 'లక్కీ'అనే కుక్కను అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు. అతడు కార్యాలయానికి వెళ్లగా గేటు వద్దకు వచ్చిన కుక్కపిల్ల తిరిగి ఇంట్లోకి రాలేదు. ఎంత సేపటికీ అది రాకపోవడంతో కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా అది కనిపించలేదు. జమాల్ బస్తీలోని కల్లు కంపౌండ్‌లోకి కుక్కపిల్లను తీసుకెళ్లినట్లు స్థానికులు వారికి తెలిపారు. వెంటనే వారు అక్కడికి వెళ్లి సీసీ ఫుటేజీని పరిశీలించగా ఓ మహిళ తీసుకొచ్చినట్లు గుర్తించారు. కుక్కపిల్లను ఎవరైన గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని వారు కోరారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశామని వారు తెలిపారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి



న్యూరామాలయం వద్ద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని సూచిస్తున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: డివిజన్ పరిధిలోని న్యూ రామాలయం పరిసర ప్రాంతాలలో ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను వారం క్రితం తొలగించి వదిలేశారు. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెండడంతో పాటు దుర్వాసన వస్తోందని స్థానికులు కార్పొరేటర్ అమృత దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ మంగళవారం న్యూరామాలయం పరిసరాల్లో పర్యటించారు. వీధుల్లో చెట్ల కొమ్మలు కుప్పలుగా పేరుకుపోవడం గమనించిన ఆమె వెంటనే పారిశుధ్య విభాగం ఎస్ఎఫ్ఏలు, సిబ్బందిని రప్పించారు. వీధుల్లో చెత్తాచెదారం ఇలా పేరుకుపోతుంటే మీరంతా ఏమి చేస్తున్నారని నిలదీశారు. చెట్ల కొమ్మలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా న్యూరామాలయం సిబ్బంది, అర్చకస్వాములు కొన్ని సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ఆమె వాటి పరిష్కారానికి తన వంతు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించండి



కార్పొరేటర్ పావని సమక్షమంలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్సార్టీ వాసులు

చిక్కడపల్లి: డివిజన్‌లోని ఎస్సార్టీలో కలుషిత మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కారించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని మంగళవారం వాటర్‌వర్క్స్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం డివిజన్‌లోని ఎస్సార్టీలో కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మేరకు వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో పాటు ఆమె కలసి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కావడం దారుణమని ఆమె అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. అదే విధంగా లోప్రెషర్ సమస్యను తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆనంద్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, బి.భరత్, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, ఎస్సార్టీ నేతలు డేవిడ్, ప్రశాంత్, నరిసంగ్‌రావు, యాదమ్మ, శివ, శ్రీధర్, సంజీవ్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



అమ్మవారి కల్యాణోత్సవంలో సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ, ఉద్యోగులు

చిక్కడపల్లి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం ప్రాంగణంలోని శ్రీ రేణుకాఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కల్యాణోత్సవంలో గ్రంథాలయ కార్యదర్శి పద్మజ, ఉద్యోగులు వెంకటేశ్వర్‌రెడ్డి, అవినాష్, వెంకటేష్‌యాదవ్, బొల్లం మహేందర్, కృష్ణారెడ్డి, చంద్రకళ, ప్రతిభారెడ్డి, జంగారెడ్డి, హరిబాబు, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నల్లకుంట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ పేర్కొన్నారు. దివంగత ఏపీ మాజీ సీఎం వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం నల్లకుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం కట్టెల సుభాష్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే గుర్తొచ్చే పేరు వైఎస్సార్ అని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పావలా వడ్డీకే రుణాలు, జలయజ్ఞం సహా ఎన్నో పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఓటమి లేకుండా 6సార్లు ఎమ్మెల్యేగా, 4 సార్లు ఎంపీగా గెలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రభుదాస్, సీహెచ్. మురళీకృష్ణ రమేష్, ఊమారాణి, తదితరులు పాల్గొన్నారు.

టీఎంఎస్ రాష్ట్ర సహాయ కోశాధికారిగా మహేష్

నల్లకుంట: తెలంగాణ మహేంద్ర సంఘం (టీఎంఎస్) రాష్ట్ర సహాయ కోశాధికారిగా నల్లకుంట రత్నానగర్‌కు చెందిన పాతకోటి మహేష్ నియమితులయ్యారు. మంగళవారం బస్తీవాసులను మహేష్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు కేపీ.మురళీకృష్ణ, ఆర్.నర్సింగ్‌రావు, చతీష్‌చంద్రగౌడ్, పోచాలు ప్రసాద్, వీరయ్య, మేడి వెంకటేష్, బి.రఘు, సన్నీ, శ్రీనివాస్, ఉపేందర్, బీరప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోండి

పలు దుకాణాలను సీజ్ చేసిన అధికారులు

ముషీరాబాద్: ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా వ్యాపారం చేసే వారి దుకాణాలను సీజ్ చేస్తామని జీహెచ్ఎంసీ డీఎంసీ రామానుజులారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ముషీరాబాద్‌లో జీహెచ్ఎంసీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్తిపన్ను చెల్లించని వారి దుకాణాలను సీజ్ చేశారు. అయితే కొందరు బకాయిలు చెల్లించారు. ఇప్పటికే మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. సకాలంలో ట్యాక్స్ చెల్లించాలని లేకుంటే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఓ వ్యాపారి రెండేళ్లుగా ట్యాక్స్ చెల్లించకుండా వ్యాపారం కొనసాగించడాన్ని గుర్తించామన్నారు. సీజ్ చేస్తామని చెప్పడంతో వెంటనే రూ.3.64 లక్షలు చెల్లించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రవీణచంద్ర, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రహదారుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ



అశోక్‌నగర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో రూ.34లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు పనులను చేపట్టనున్నారు. మంగళవారం కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ... రహదారుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అన్నారు. మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ నాయకులు లింగంగౌడ్, సరేష్‌గౌడ్, అంజయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం వద్ద శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలి



దేవాలయం వద్ద తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్ శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శాశ్వత షెడ్లు నిర్మించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని కట్టమైసమ్మ దేవాలయ భక్త సమాజం అధ్యక్షుడు రవీందర్ హెచ్చరించారు. శాశ్వత షెడ్లు ఏర్పాటు చేయాలని దేవాదాయ మున్సిపల్ అధికారులకు వినతి పత్రం ఇస్తే సానుకూలంగా స్పందించారన్నారు. ఈ విషయంపై సమగ్ర సమాచారాన్ని తమకు తెలియజేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవోకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత బోనాల సందర్భంగా కనీసం తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆయన దేవాదాయ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. ఖాళీ స్థలంలో పార్కింగ్‌ను రద్దు చేసి శాశ్వత షెడ్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.వెంకటేష్, ఎంసీ మహేందర్‌బాబు, పరశురాం, సలంద్రి దిలీప్ యాదవ్, బొల్లరమేష్, ప్రభాకర్ గంగపుత్ర, కుమార్, అనిల్, గద్దె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

నల్లకుంట: విద్యాసంస్థల్లో ఈవ్ టీజింగ్, మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలు, నేటి సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలపై మంగళవారం నల్లకుంటలోని శ్రీ గురుదత్త హై స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన నల్లకుంట కార్పొరేటర్ అమృత మాట్లాడుతూ.. తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఎలా ఉండాలి? గుర్తు తెలియని వ్యక్తుల పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలో విద్యార్థులకు వివరించారు. నల్లకుంట ఎస్సై వరలక్ష్మి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాలను వివరించారు. అలాగే ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. సోషల్ మీడియాను అతిగా వాడితే కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.లక్ష్మణ్‌కుమార్, బీజేపీ కేజే బాబు, మధుసూదన్, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత, అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- అంబర్‌పేట ఆలయ ప్రాంగణంలో బోనాల నిర్వహణపై సమీక్ష
- హాజరైన వివిధ విభాగాల అధికారులు, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు
- మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వద్దు
- బాధ్యత, భక్తితో బోనాల విధులు నిర్వర్తించాలని సూచన
- 139 ఆలయాలకు రూ.55.29 లక్షల చెక్కుల పంపిణీ
- అంబర్‌పేట ప్రధాన రోడ్డు సమస్య పరిష్కారంపై మౌనం



బోనాల వేడుకలకు ఆలయాలకు మంజూరైన చెక్కులను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: బోనాల వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల చేయూతనిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతిక అని అన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో బోనాల పండగను నిర్వహించుకునేందుకు తమ సహకారం అందిస్తామని అన్నారు. బోనాల ఉత్సవాలకు ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత, భక్తితో విధులు నిర్వహించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. మంగళవారం అంబర్‌పేట మహంకాళి ఆలయ ప్రాంగణంలో బోనాల వేడుకల నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లతో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంబర్‌పేటనియోజకవర్గంలో వివిధ ఆలయాలకు మంజూరైన చెక్కులను నిర్వాహకులకు అందజేశారు. నియోజకవర్గంలో 139 ఆలయాలకు రూ.55.29 లక్షల చెక్కులను కార్యక్రమంలో పంపిణీ చేశారు.

ఆలయాల వద్ద మౌలిక వసతులు కల్పించండి..

◆ ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ... బోనాల వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు. ఈనెల 13న ఉజ్జాయిని మహంకాళి, ఈనెల 20 లాల్‌దర్వాజ్, అంబర్‌పేట బోనాల వేడుకల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న అన్ని అమ్మవారి ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలను యుద్ధప్రతిపాదికన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాలు, మురుగు సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. గత బోనాల వేడుకల్లో తలెత్తిన ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది అవి ఉత్పన్నం కాకుండా చొరవ తీసుకోవాలన్నారు.

అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి...

◆ ప్రధానంగా అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు పూర్తి స్థాయిలో సమన్వయంతో పని చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన సున్నితంగా హెచ్చరించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే అన్ని ఆలయ కమిటీలు, నిర్వాహకులతో అధికారులు సమన్వయంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, ఉమారాణి, లావణ్యశ్రీనివాస్‌గౌడ్, అమృత, అడిషనల్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి, డీఎంసీ మారుతీదివాకర్, అంబర్‌పేట దేవాస్థాన సేవా సమితి ప్రతినిధులు, నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట రోడ్డు సమస్యపై సమాలోచనలు...

◆ అంబర్‌పేట ప్రధాన రోడ్డు సమీపంలో ఉన్న మహంకాళి ఆలయం పరిసరాల్లో రోడ్డు సమస్య కొంత కాలంగా ఇబ్బందికరంగా మారింది. ఫ్లైఓవర్ కింద రోడ్డుపై సున్నిత సమస్యగా మారిన వైనాన్ని సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. సమావేశంలో ఉన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సైతం స్పందించి పరిష్కరించాలని అక్కడే ఉన్న ఉన్నతాధికారులను అదేశించారు. దీంతో మంత్రి, ఎమ్మెల్సీ, ఉన్నతాధిరులు రోడ్డు సమస్యపై దృష్టి పెట్టడడంతో స్థానిక కాంగ్రెస్ పెద్దలు వారిని వారించారు. రోడ్డు సమస్య సున్నిత అంశమని వీహెచ్ వారికి సైగ చేయడంతో అంతా మిన్నకుండిపోయారు. ఇది గమనించిన అక్కడి వారు అవాక్కయ్యారు. మరి ఈ సమస్యకు మోక్షం లభిస్తుందా లేదా అనేది వేచి చూడాలి.